క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

దేవరపల్లి: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నల్లజర్ల పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్టు ఎస్‌ఈబీ దేవరపల్లి సీఐ డి.సుధ శనివారం తెలిపారు. నల్లజర్ల మండలం గండేపల్లి గ్రామంలోని ఎర్ర కాలువ తుమ్మల గండి వద్ద శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఆమె చెప్పారు.

క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

నల్లజర్ల: క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ దిశగా తాను నిరంతరం కృషి చేస్తానని క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్‌గా నియమితులైన మేడిద జాన్సన్ అన్నారు.గోపాలపురం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఆయనను భీమవరంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ షేక్ గపూర్, కార్యదర్శి రెవరండ్ సురేష్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు శ్యాంబాబు, ముంగమూరి ప్రసాదబాబు, ఇజ్రాయిల్ రాజు, పొలిటికల్ ఇన్‌చార్జ్ సుధాకర్ తదితరులు జాన్సన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

వేంకటేశ్వరునికి లక్ష తులసి పూజ

కొవ్వూరు: ధనుర్మాసం సందర్భంగా ఆరికిరేవుల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి లక్ష తులసీ దళాలతో పూజ చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాంతి కల్యాణం, పూర్ణాహుతి జరిగాయి. ధర్మకర్త గుత్తా వెంకటకృష్ణ, గుత్తా బుల్లిరాజు, చావా వెంకట్రావు, యనమదల రామారావు, పోతుల ఏకోనారాయణ సర్వ సుందరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధానార్చకుడు గోవర్ధనం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వేలివెన్నులో హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ఉండ్రాజవరం: శశిధర్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేలివెన్ను శశి విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. నాలుగో రోజు శనివారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో వేలివెన్ను ఫ్రెండ్స్, జనతా యూత్ జట్లు తలపడగా జనతా యూత్ గ్రాండ్ టీమ్, రెండో మ్యాచ్‌లో ముక్కామల, ఖండవల్లి జట్ల మధ్య జరగ్గా ఖండవల్లి జట్టు విజయం సాధించాయి. మూడో మ్యాచ్‌లో గోపవరం, కానూరు జట్లు తలపడగా, గోపవరం జట్టు విజయం సాధించింది. ఇక నాలుగో కాల్దారిపై డి.ముప్పవరం జట్టు గెలిచింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు కూడా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి కల వారు ఆదివారం సాయంత్రం లోగా తమ జట్ల పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

ఝాన్సీ శ్రీలక్ష్మి వైద్యానికి మానవత సాయం

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం వద్ద రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న ఎనిమిదో తరగతి విద్యార్థిని రాపాక ఝాన్సీ శ్రీలక్ష్మి వైద్యానికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ సభ్యులు శనివారం రూ.ఐదు వేలు విరాళంగా అందించారు. సుబ్బరాయపురంలోని ఇంటి వద్ద వారు ఆమెను పరామర్శించి, ఈ సాయం చేశారు. ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడిపోయి తీవ్రంగా గాయపడిన ఇదే గ్రామానికి చెందిన కడలి శ్రీనివాస్‌కు రూ.5 వేల సాయంగా అందజేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని కడలి నాగశ్రీ చదువుకు ఆర్థిక సాయం అందించడానికి మానవత సంస్థ సభ్యులు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ బలుసు సత్యనారాయణ, వైస్ చైర్మన్ పప్పు వెంకట రామారావు, యలమాటి సత్యనారాయణ, సత్తి సాయి ఈశ్వరరెడ్డి, ఆచంట రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతుడు

నిడదవోలు రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం గతేడాది డిసెంబర్ 24న సమిశ్రగూడెం-గోపవరం మధ్య గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆ వ్యక్తిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిస్తే 94407 96661, 08813-221213 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఐవైఎం రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

గోపాలపురం: ఐడియల్ యూత్ మూమెంట్ (ఐవైఎం) పోస్టర్‌ను స్థానిక జామియా మసీదు వద్ద శనివారం ముస్లిం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనాబ్ ఫారుక్ మాట్లాడుతూ ముస్లిం యువతలో నైతికతను పెంపొందించడానికి, నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములను చేయడానికి ఐవైఎం ఎంతో దోహద పడుతుందన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో విజయవాడలో ఐవైఎం రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందన్నారు. విశ్వాసం, ప్రగతి, ఆత్మ గౌరవం నినాదంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముస్లిం యువత భాగస్వాములు కావాలని కోరారు. ముస్లిం నాయకులు అబ్దుల్ రహమాన్, ఎస్‌కే బడేబాబు, ఇస్మాయిల్ ఖాన్, హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమం,అభివృద్ధే ధ్యేయంగా..

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ప్రకాశరావుపాలెంలో గడప గడపకూ..



ఓ కుటుంబానికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: పేదల సంక్షేమంతో పాటు పల్లెల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ప్రకాశరావుపాలెంలో శనివారం సాయంత్రం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు, పూలతో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. పంచాయతీ సర్పంచ్ జాన్ విక్టర్, కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు, ముత్తిన నాని, నరేష్, కరుటూరి నాగభూషణం, మట్టా లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సచివాలయ వ్యవస్థ గ్రామీణులకు వరం

సచివాలయ వ్యవస్థ గ్రామీణులకు వరం లాంటిదని ఎమ్మెల్యే వెంకట్రావు పేర్కొన్నారు. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థ అమలు తీరును పరిశీలించి తమ రాష్ట్రాల్లోనూ అమలు చేయడానికి చర్యలు తీసుకోవడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనమన్నారు. వలంటీర్ల సహకారంతో ఇంటి వద్దకే సేవలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రకాశరావుపాలెం గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రధాన రహదారి నుంచి పాకనాటి తాతారావు ఇంటి వరకూ ప్రధాన డ్రెయిన్, 5,6 వార్డులలో అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజీ, అక్కడక్కడా మిగిలి పోయిన సీసీ రహదారులను పూర్తి చేయించాలని కోరారు. అలాగే ఎస్సీ ఏరియాలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయించాలని, బీసీ ఏరియాలో తాగునీటి బోరుకు త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, నాయకులు దూలపల్లి రామకృష్ణ, మలుకుర్తి శ్రీను, చిన్ని, దేవిన మధు, నేకూరి సూర్యచంద్రం, ముప్పిడి వెంకటరత్నం, వామిశెట్టి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

చాగల్లు: సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మార్కొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు సుమారు 200 మందికి శనివారం నోట్ పుస్తకాలు, పలకలు, ఇతర విద్యా సామగ్రి కిట్లు పంపిణీ చేశారు. ఆ ఫౌండేషన్ చైర్మన్ సుంకవల్లి వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో వాటిని విద్యార్థులకు అందజేశారు. అనంతరం గ్రామంలోని వైద్య సిబ్బందికి బీపీ చెక్ చేసే మిషన్ వంటి వైద్య పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనాయకులు ఉప్పులూరి బాబూరావు, గ్రంధి విజయకుమార్, తమ్మిశెట్టి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

గోపాలపురం: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని జగన్నాథపురంలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏటా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి స్థానిక సాయిగణేశ్ ఏజెన్సీ నిర్వాహకులు, సంతూర్ సోప్ సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు బి. రాంబాబు తెలిపారు.

పందేల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు

- అధికారుల హెచ్చరిక
- గ్రామాల్లో అవగాహన సదస్సులు

నల్లజర్ల: సంక్రాంతి సందర్భంగా ఎక్కడా కోడి పందేలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దారు మక్సూద్ ఆలీ సూచించారు. ఈ విషయమై మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో అధికారులు శనివారం సమావేశమై కార్యాచరణ రూపొందించారు. ఈనెల 7 నుంచి 30 వరకూ మండలం అంతా 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎక్కడైనా కోడి పందేల బరులను ఏర్పాటు చేస్తే ధ్వంసం చేయించాలని సీఐ లక్ష్మణరెడ్డి సూచించారు. అలాంటి ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీఓ జోగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పెద్దలతో మాట్లాడి సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీలను ప్రోత్సహించాలన్నారు.

చాగల్లు: కోడిపందేలు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ అంశంపై ఊనగట్ల గ్రామస్తులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంక్రాతి పేరుతో కోడి పందేలు, పేకాట క్లబ్‌లు, కోతాట, లోన బయట వంటి ఆటలు నిర్వహించరాదన్నారు. చాగల్లు ఎస్‌ఐ సీహెచ్‌వీ రమేష్ మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించే వారు యానిమల్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులన్నారు. ఎక్కడ బరులు ఏర్పాటు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.రామ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎండీ ఆలీ, పాల్గొన్నారు.

దేవరపల్లి: సంక్రాంతి పేరుతో మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, గుండాట వంటివి ఎవరైనా నిర్వహిస్తే వణ్య ప్రాణుల సంరక్షణ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

కోర్టు ఆదేశాలను విధిగా అమలు చేయాలి



సమిశ్రగూడెంలో జెడ్పీ హైస్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల, గీతా మందిరం స్థల వివాదంలో కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ ఆదేశించారు. ఆ హైస్కూల్‌కు చెందిన స్థలంలో కోర్టు ఆదేశాలతో నిర్మించిన ప్రహరీని శనివారం ఆయన పరిశీలించారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తహసీల్దార్ ఎం.గంగరాజు, ఎంపీడీఓ టి.మూర్తిబాబు, సచివాలయ సిబ్బంది వెంట ఉన్నారు.

న్యూటన్ పాండుకు అంబేద్కర్ మేధోరత్న అవార్డు



నిడదవోలు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మేధోరత్న అవార్డుకు మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు విప్పర్తి ఐజక్ న్యూటన్ పాండు ఎంపికయ్యారు. గౌతమి బుద్ధ ప్రచార ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు రెవెన్యూ భవన్‌లో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో తాను ఈ పురస్కారాన్ని అందుకుంటానని శనివారం ఆయన తెలిపారు. న్యూటన్ పాండును యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, హెచ్‌ఎం పి.గురుమూర్తి, ఉపాధ్యాయురాలు స్వర్ణకుమారి తదితరులు అభినందించారు.

స్థలం ఉంటే గృహానికి దరఖాస్తు చేసుకోండి

- ఎంపీపీ దుర్గారావు
- దేవరపల్లిలో గృహ లబ్ధిదారులకు అవగాహన సదస్సు



దేవరపల్లిలో గృహ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని పేదలు దరకాస్తు చేసుకుంటే పక్కా గృహాలు మంజూరు చేస్తారని ఎంపీపీ కేవీకే దుర్గారావు చెప్పారు. శనివారం గృహ నిర్మాణ దినోత్సవం సందర్భంగా దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద గృహ లబ్దిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కడిమి వీర కుమారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎంపీపీ దుర్గారావు మాట్లాడారు. దేవరపల్లిలో 950 మందికి ప్రభుత్వం ఇంటిస్థలాల పట్టాలు ఇచ్చిందన్నారు. ఫిబ్రవరి నుంచి గ్రామంలో 1640 మంది పేదలకు గృహాల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. హౌసింగ్ ఏఈ కె.ధర్మారావు మాట్లాడుతూ ప్రధాని అవాస్ యోజన గ్రామీణ పథకంలో దేవరపల్లికి 250 గృహాలు మంజూరవగా, వాటిలో 37 గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మిగిలిన లబ్దిదారులు నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. సదస్సులో ఉపసర్పంచ్ వెలగా సాంబశివరావు, వైఎస్సార్ సీపీ గ్రా మ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కడిమి రాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. లబ్దిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలు అందజేశారు.

తాళ్లపూడి: ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో ఎం.రాజశేఖర్ సూచించారు. మండలంలోని వేగేశ్వరపురం, తాళ్లపూడి తదితర సచివాలయాల వద్ద హౌసింగ్ డే నిర్వహించి గృహ నిర్మాణంపై లబ్దిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.రాధిక, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఏఈ సుబ్బరాజు, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: గృహ నిర్మాణాలను ఈ నెలాఖరుకు పూర్తిచేసి లబ్దిదారులు గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ టి.మూర్తిబాబు సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణంపై గృహనిర్మాణ శాఖ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం ఆయన సమీక్ష జరిపారు. ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వాన్ని ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

చాగల్లు: మండలంలోని చిక్కాలపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ మట్టా వీరాస్వామి శనివారం భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు రూ.8 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మిస్తారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరాస్వామి మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు కోటి రూపాయల వ్యయంతో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమల రావు, ఉప సర్పంచ్ తాతా శ్రీహరి, అతిరాస కార్పొరేషన్ డైరెక్టర్ సంసాని రమేష్, మాజీ ఉప సర్పంచ్ బండి శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఓపెన్ ఇసుక రీచ్‌ల వద్ద పడవ కార్మికుల ఆందోళన



బల్లిపాడు ర్యాంపు వద్ద ఇసుక లారీలను అడ్డుకున్న పడవ కార్మికులు, బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు

తాళ్లపూడి: తాళ్లపూడి, పోలవరం, కొవ్వూరు మండలాల పడవ కార్మికులు, బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు శనివారం బల్లిపాడు, కుమారదేవంలలోని గోదావరి ఓపెన్ ఇసుక ర్యాంపుల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. ఇసుక లారీలను వారు స్తంభింపజేశారు. బల్లిపాడు, కుమారదేవంలలోని గోదావరి ఓపెన్ ఇసుక రీచ్‌ల వల్ల మూడు మండలాల్లోని పడవ కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. తమకు ఉపాధి చూపాలని బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు, పడవ కార్మికులు డిమాండ్ చేశారు. తాము పడవల ద్వారా గోదావరి నదిలోని ఇసుక సేకరించి ఉపాధి పొందుతున్నామని కాని, ఇప్పుడు బోట్స్‌మెన్ సొసైటీ రీచ్‌లలో టన్ను ఇసుక రేటు రూ.625 ఉండగా, ఓపెన్ రీచ్‌లలో టన్ను ఇసుక రేటును రూ.475గా నిర్ణయించడం వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. ఓపెన్ రీచ్‌లలో 200 వరకూ మెషీన్లను వాడుతున్నారని వాటిని తొలగించి కూలీలకు పని కల్పించాలని వారు కోరారు. వీరికి మద్దతుగా వైఎస్సార్ సీపీ నాయకులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు.

నేడు ఓటర్‌లో ఆధార్ లింకేజీ

గోపాలపురం: ఓటరు కార్డుకు ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయించుకోవాలని తహసీల్దార్ బి. రవీంద్రనాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 8వ తేదీ ఆదివారం నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు కార్డుకు ఆధార్‌తో అనుసంధాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకూ జరుగుతుందని తహసీల్దార్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తేలని గోదాలంక లంక సరిహద్దులు

మల్లేశ్వరం వద్ద గోదావరి లంకలో సర్వే



మల్లేశ్వరం వద్ద గోదావరి లంకలో సర్వేకు సిద్ధమైన రెవెన్యూ, సర్వే అధికారులు

పెరవలి: తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సరిహద్దులను నిర్ణయించేందుకు అధికారులు శనివారం పెరవలి మండలం మల్లేశ్వరం వద్ద గోదావరి లంకలో సర్వే ప్రారంభించారు.ఈ రెండు జిల్లాల హద్దుల నిర్ధారణ కోసం సరిహద్దుల్లో ఇసుక, మట్టి తవ్వకాలను కొద్ది రోజులగా నిలిపి వేశారు. ఇక్కడ నిర్వహిస్తున్న ఇసుక, మట్టి తవ్వకాలపై రెండు జిల్లాల వాసులు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు. మరోపక్క ఇసుక, మట్టి తవ్వకాలు నిలిచిపోవడంతో పలు గ్రామాల్లోని జగన్న లే అవుట్‌లలో మెరక పనులు, నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో ఇరు జిల్లాల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా సర్వే నిర్వహించాలని రెండు జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు ఇచ్చారు. వారి ఆదేశాల మేరకు శనివారం సర్వే పనులను ప్రారంభించారు. తొలుత సర్వే అధికారులు రికార్డులను పరిశీలించారు. గోదావరి లంకలు ఎవరి ఆధీనంలో ఉంటే వారే అనుభవించాలని, భూములు ఏ జిల్లా పరిధిలో ఉంటే ఆ జిల్లా అధికారులే అనుమతులు ఇవ్వాలని ప్రతిపాదించారు. అయితే దీనిపై కూడా తర్వాత వారిమధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ విషయాన్ని వారు రెండు జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ల సూచనల మేరకు సర్వేను నిలిపివేశారు. కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు: చంపుతానంటూ భార్యాభర్తలను బెదిరించిన అభియోగంపై మండలంలోని దొమ్మేరు గ్రామానికి చెందిన గుడపాటి సందీప్ (టింకు) అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి. దుర్గాప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 5వ తేదీ రాత్రి టింకు మోటార్ సైకిల్‌పై వేగంగా అదే గ్రామానికి చెందిన పామెర్ల లక్ష్మి పైకి దూసుకు రాబోయాడు. దీంతో టింకూను ఆమె భర్త అయిన పామెర్ల సత్యనారాయణ మందలించాడు. ఆ కోపంతో ఆరో తేదీ రాత్రి టింకూ తాగి తన ఇంటికి వచ్చి తనను, తన భార్యను కొట్టి చంపుతానంటూ బెదిరించాడంటూ సత్యనారాయణ కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. భార్యాభర్తలు ఇరువురు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై బి. దుర్గాప్రసాద్ తెలిపారు.

జనసేన, వామపక్షాల ధర్నా

దేవరపల్లి: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబరు ఒకటిని రద్దు చేయాలని కోరుతూ జనసేన, వామ పక్షాలు శనివారం దేవరపల్లి బస్టాండ్ వద్ద ధర్నా చేశాయి. జీఓ ప్రతులను దగ్ధం చేశారు. సభలు పెట్టుకోవడానికి వీలులేకుండా జీఓ తీసుకురావడం దారుణమని నాయకులు పేర్కొన్నారు. జనసేన నియోజకవర్గ నాయకులు డి. సువర్ణరాజు, సిర్రా రాము, కె. సత్తిబాబు, వామ పక్షాల నాయకులు ఎస్. భగత్, పి.నాగేశ్వరరావు, ఉండవల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ పనితీరుపై టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో ఎస్.మల్లిబాబు శనివారం తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందకపోయినా, ఇతర సమస్యలపైన ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 94402 95493 నంబర్‌ను సంప్రదించాలని ఆయన రోగులకు సూచించారు.

వలంటీర్లకు నియామక ఉత్తర్వులు

గోపాలపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేసినట్టు ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి చెప్పారు. కొత్తగా ఎంపికైన ఆరుగురు వలంటీర్లకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ చేతుల మీదుగా శనివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. వలంటీర్లు తమకు కేటాయించిన 50 ఇళ్లకు బాధ్యతగా పని చేసి రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తింపు తేవాలని ఎంపీపీ సత్యనారాయణ సూచించారు.